సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



తండాల్లో అటకెక్కి..

తండాల్లో సర్కార్ చదువు అటకెక్కుతోంది. పలు చోట్ల గదులు లేకపోవడంతో చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు.

- IIIలో ▸



పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం

34.2 / 19.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. రోజంతా మబ్బులతో కూడిన ఎండ ఉంటుంది.

సాక్షి గొంతునొక్కే కుట్ర

- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా..?
- ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే..
- కక్ష సాధింపులు మానుకోవాలి
- నేడు బాన్సువాడలో ధర్నా



కామారెడ్డి టౌన్/బాన్సువాడ/ఎల్లారెడ్డి: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న 'సాక్షి' గొంతును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నొక్కుతోందని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. ప్రజల పక్షాన అక్షర సమరం చేస్తున్న కక్షగట్టి ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డితోపాటు పలువురు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం, విచారణ పేరుతో సాక్షి ప్రధాన కార్యాలయంపై పోలీసులు దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు. సాక్షిపై దాడులను ఆపాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం ఉదయం బాన్సువాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, విద్యార్థి సంఘాల, సీపీఐ, సీపీఎం నాయకులు హాజరుకానున్నారు.

కేసుల నమోదు సిగ్గుచేటు



ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడులు, కేసుల నమోదు పత్రికాస్వేచ్ఛకు గొడ్డలి పెట్టుగా భావిస్తున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరుమార్చుకోవాలి.

– సురేశ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి

మీడియాపై రాజకీయ కక్ష



మీడియాపై రాజకీయ కక్ష తగదు. వాస్తవాలను చెబుతున్న సాక్షిని కేసులు పెట్టి అడ్డుకోవాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. మీడియాపై అధికారుల దాడులు, ఒత్తిళ్లు, వేధింపులు ఆపకపోతే తీవ్ర పరిణాలుంటాయి. దీన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణిస్తున్నాం.

– విజయ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు

పతనం తప్పదు



రాజకీయ కక్షలతో సాక్షిపై దాడులు చేస్తూ కేసులు చేస్తున్నారు. పత్రిక గొంతు నొక్కితే పతనం తప్పదు. గత కొద్ది రోజులుగా సాక్షిపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును అంతా గమనిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో పత్రికలపై జరుగుతున్న దాడులను అందరూ ఖండించాల్సిందే.

– పద్మ వెంకట్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

చట్టాలను గౌరవించాలి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టాలను గౌరవించకుండా కేవలం కక్ష సాధింపుతో సాక్షిపై దాడులు చేస్తున్నారు. ఇది ముమ్మాటికి కక్ష సాధింపుగానే భావిస్తున్నాం. ఏమైనా ఉంటే న్యాయ, చట్టపరంగా ముందుకు వెళ్లాలి. ఇలా అక్రమ కేసులు పెట్టి పత్రికాస్వేచ్ఛను, గొంతును నొక్కేందుకు ప్రయత్నించడం సరికాదు.

– శివప్రసాద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



పత్రికా స్వేచ్ఛపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏదైనా ఉంటే చట్టపరంగా చూసుకోవాలని తప్ప ఇలా వ్యక్తిగతంగా సాక్షిపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం కాపాడాలి.

– లక్ష్మణ్‌యాదవ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



దోమకొండ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయసేవా సదస్సు నిర్వహించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో భారత శిక్ష సంవిధాన, చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్, పోక్సో, విద్యాహక్కు చట్టాల గురించి న్యాయమూర్తి వివరించారు. మైనర్ వివాహాల నిషేధ చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యాహక్కు చట్టం 14 ఏళ్ల లోపు పిల్లలందరికీ చదువుకునే హక్కు కల్పించిందన్నారు. పిల్లలను పనికి పంపితే తల్లిదండ్రులు నేరస్తులవుతారని స్పష్టం చేశారు. మండల విద్యాశాఖ అధికారి విజయ్‌కుమార్, దోమకొండ ఎస్సై స్రవంతి, పారాలీగల్ సొసైటీ సభ్యులు, పాఠశాల హెడ్ మాస్టర్ శరత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు



బాన్సువాడ : పార్టీ కోసం కష్ట పడి పని చేసే వారికే పదవులు లభిస్తాయని ఏఐసీసీ జిల్లా పరిశీలకులు రాజ్‌పాల్ కరోలా అన్నారు. పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరోలా మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, కష్ట కాలంలో పార్టీ వెంట ఉండి కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పటికే చాలా మంది దరఖాస్తులు అందజేశారన్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కైలాస్ శ్రీనివాస్‌కు తిరిగి డీసీసీ పదవి ఇవ్వాలని స్థానిక నాయకులు సూచించారు. కరోలాను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం కార్యకర్తలతో రాజ్‌పాల్ కరోలా సమావేశమయ్యారు.

తెలంగాణ బంద్‌కు సహకరించాలి




కామారెడ్డి టౌన్: ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు వ్యాపార, వాణిజ్య, విద్య, రవాణా సంస్థలు, ప్రజలు సహకరించాలని బీసీ, అఖిలపక్ష నాయకులు కోరారు. బంద్‌లో పాల్గొనాలని కోరుతూ చాంబర్ ఆఫ్ కామర్స్, ఆయా వ్యాపార సంఘాలకు గురువారం వినతిపత్రాలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంబాల లక్ష్మణ్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు గణేశ్‌నాయక్, కొత్తపల్లి మల్లన్న, వెంకట్‌గౌడ్, ప్రవీణ్, యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పిన సర్దుబాట్లు!

నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల డిప్యుటేషన్లు

- అవసరం ఉన్న చోట కాదు.. అనుకూలంగా ఉన్న చోటికి..
- మారని విద్యాశాఖ అధికారుల తీరు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారంలో విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మొదటి నుంచి కామారెడ్డి జిల్లా విద్యాశాఖ కార్యాలయం వివాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. డబ్బులు సర్దుబాటు చేస్తే ఎక్కడికంటే అక్కడికి సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాట్లు జరిగినట్టు తెలుస్తోంది. అవసరం ఉన్న బడికి సమీప పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాట్లు చేయాల్సి ఉండగా విద్యాశాఖ అధికారులు నిబంధనలను తుంగలోకి తొక్కి అడ్డగోలుగా డిప్యుటేషన్లు వేశారని పలువురు ఆరోపిస్తున్నారు. అవసరం ఉన్న చోటకు సమీపంలోని ఉపా ధ్యాయులను సర్దుబాటు చేయాలని జీవో నంబర్ 25 స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ జిల్లాలో విచ్చలవిడిగా డిప్యుటేషన్లు వేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన టీచర్ల సర్దుబాటు వ్యవహారంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఒకరిని రామారెడ్డి మండలానికి పంపించారు. నాలుగైదు మండలాలు దాటించారు. తరువాత అక్కడి నుంచి కామారెడ్డి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారు. సదరు ఉపాధ్యాయుడు పనిచేయాల్సిన బడిలో అవసరం లేకుంటే, అదే నాగిరెడ్డిపేట మండలంలో ఏదో ఒక బడికి పంపించాలి. లేనిపక్షంలో పక్కనే ఉన్న ఎల్లారెడ్డి మండలానికో, పొరుగున ఉన్న లింగంపేట మండలంలో అవసరం ఉన్న బడులకు సర్దుబాటు చేయాలి. కానీ నాలుగైదు మండలాలు దాటించి జిల్లా కేంద్రానికి తీసుకురావడంలో మతలబు ఏమిటో విద్యాశాఖ అధికారులకే తెలియాలి.
- కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి నుంచి ఓ ఉపాధ్యాయుడిని కామారెడ్డి పట్టణంలోని ఎస్సీ వాడ ఉన్నత పాఠశాలకు, తరువాత అక్కడి నుంచి ఉగ్రవాయి బడికి పంపించారు. ఇదేం సర్దుబాటనేది ఎవరికీ అర్థం కాదు.
- లింగంపేట మండలం మోతె నుంచి రామారెడ్డికి, రామారెడ్డి నుంచి మోతెకు పరస్పరంగా సర్దుబాటు చేశారు.
- ఎల్లారెడ్డి మండలం నుంచి మరో ఉపాధ్యాయుడిని బాన్సువాడకు పంపించారు.
- భిక్కనూరు మండలం కాచాపూర్ నుంచి కామారెడ్డి పట్టణానికి ఇంకో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు.
- మద్నూర్ మండలం నుంచి రామారెడ్డి మండలానికి మరో ఉపాధ్యాడిని సర్దుబాటు చేసినట్టు తెలుస్తోంది.
- ఎల్లారెడ్డి మండలం నుంచి రాజంపేట మండలానికి మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు.

అనుకూలమైన చోటికి..

సబ్జెక్టు టీచర్లు లేని స్కూళ్లకు సమీపంలోని లేదా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న, లేదా అవసరానికి మించి ఎక్కువ మంది టీచర్లు ఉన్న స్కూల్ నుంచి సర్దుబాటు చేయాలి. ముఖ్యంగా కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేయాలి. కాదూకూడదంటే మండలం పరిధిలో, అవసరం మేరకు పక్క మండల నుంచి సర్దుబాటు చేయాలి. కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు కొందరు టీచర్లతో లాలూచీ పడి మూడు, నాలుగు మండలాలు దాటించి వారికి అనుకూలం ఉన్న బడికి పంపించారు. అలాగే పరస్పర డిప్యుటేషన్లు కూడా చేపట్టారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుడు అవసరం ఉన్నప్పటికీ టీచర్ అవసరం కోసం డిప్యుటేషన్‌పై పంపించారు.

గతేడాది రద్దు చేసినా..

గత విద్యాసంవత్సరంలో ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు చేపట్టిన వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేసి, నిబంధనల ప్రకారం సర్దుబాటు చేశారు. అయినా ప్రస్తుతం అధికారులు అదే రకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల చేపట్టిన సర్దుబాట్లే దీనికి నిదర్శనమని పలువురు అంటున్నారు. అడ్డగోలుగా జరిగిన సర్దుబాట్లపై ఓ ఉపాధ్యాయ సంఘం నేత విద్యాశాఖ అధికారిని నిలదీయగా, రద్దు చేస్తానని పేర్కొన్నట్టు తెలుస్తోంది. టీచర్ల సర్దుబాటు వ్యవహారంపై విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి

- యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: రెవెన్యూ పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్షాసమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ భారతి, సీఎం, కలెక్టరేట్ ప్రజావాణిల పెండింగ్ దరఖాస్తులు, సర్టిఫికెట్ల జారీ, ఇసుక, మట్టి అక్రమర వాణా, ప్రభుత్వ భూముల సర్వే, రేషన్ కార్డుల పంపిణీ తదితర 16 అంశాలపై రివ్యూ నిర్వహించి పరిష్కార మార్గాలను సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే సాదా బైనామాలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కొత్తగా గ్రామపాలన అధికారులు కూడా వచ్చారని, మానవ వనరులకు ఇబ్బంది లేదన్నారు. అందుబాటులో ఉన్న శిక్షణ లైసెన్స్‌డ్‌సర్వేయర్ల సేవలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ, ఫారెస్ట్ భూముల వివాదాలను ఫారెస్ట్ అధికారులతో కలిసి పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల సర్వే చేపట్టాలని, రేషన్ కార్డుల పంపిణీకి, ఇసుక, మొరం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ విక్టర్, డీఆర్‌వో మధుమోహన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఏడీ సర్వే ల్యాండ్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, సర్వేయర్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు గుర్తింపు కార్డులు..

జిల్లాలోని బీఎల్‌వోలకు ఐడీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని, నూతన ఎపిక్ కార్డులను పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్‌రెడ్డి గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6,7,8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో 259 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే వందేళ్ల వయస్సు పైబడిన వారు 106 మంది ఉన్నారని, వారిలో చనిపోయిన వారి గుర్తింపు, మిగతా వారి వయస్సు ధ్రువీకరణను పరిశీలిస్తున్నామని వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌వో మధుమోహన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన మంజీర

- 'సాగర్'కు తగ్గిన వరద
- మూసుకున్న ఫ్లడ్ గేట్లు



నిజాంసాగర్ ప్రాజెక్టు తాజా నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్): రెండు నెలలుగా వరద ప్రవాహంతో ఉరకలేసిన మంజీర నది శాంతించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గు ముఖపట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లను బుధవారం మూసివేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఈ నెల వరకు ప్రాజెక్టులోకి 290.275 టీఎంసీల ఇన్‌ఫ్లోగా వచ్చింది. ఆగస్టు 18న ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తగా అప్పటి నుంచి 53 రోజులపాటు 270.990 టీఎంసీల నీటిని మంజీరలోకి విడుదల చేశారు. వంద సంవత్సరాల ప్రాజెక్టు చరిత్రలో 290.275 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం ఇదే తొలిసారి అని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

నిలకడగా నీటిమట్టం


ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం నిలకడగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1405 అడుగుల (17.8టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

లిక్కర్‌కు మహా కిక్కు

- బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లోని దుకాణాలపై మహారాష్ట్ర వ్యాపారుల ఆసక్తి
- తెలంగాణతో పోలిస్తే పొరుగు రాష్ట్రంలో మద్యం ధర ఎక్కువ ఉండటమే కారణం
- నేడు, రేపు టెండర్ల జాతర..!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 2025–27 కాలానికి మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన గడువు శనివారంతో ముగియనుంది. లాటరీ పద్ధతిలో కేటాయించే దుకాణాల టెండర్లకు ఎక్సైజ్ శాఖ గత నెల 26 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో 102, కామారెడ్డి జిల్లాలో 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2023–25 కాలానికి 5,963 దరఖాస్తులు అందగా, 95 శాతం దరఖాస్తులు చివరి రెండు రోజుల్లోనే వచ్చాయి. ఈసారి కూడా చివరి రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

419 దరఖాస్తులు..



కామారెడ్డి రూరల్: జిల్లాలోని మద్యం దుకాణాలకు గురువారం రోజున 152 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు తెలిపారు. మొత్తం 49 వైన్‌షాపులకు ఇప్పటి వరకు 419 దరఖాస్తులు అందాయన్నారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు గాను 104, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో ఏడు దుకాణాలకు 75, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 84, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 77, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 79 దరఖాస్తులు అందినట్లు వివరించారు.

మహారాష్ట్ర నుంచి..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలో తెలంగాణతో పోలిస్తే మద్యం ధరలు 20 శాతం ఎక్కువ. దీంతో సరిహద్దుల్లోని నాందేడ్ జిల్లాకు చెందిన పలువురు ఆసక్తి కలిగిన వారు బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాలకు టెండర్లు వేస్తున్నారు. గురువారం వరకు అందిన దరఖాస్తుల్లో సుమారు 100 వరకు జిల్లాయేతరులు వేసినవే కావడం గమనార్హం. ఇందులో కరీంగనర్ జిల్లాకు చెందిన వారు వేసిన దరఖాస్తులు 60 ఉండగా, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన వారువేసినవి 40దరఖాస్తులు ఉండడం విశేషం. మహారాష్ట్రకు చెందిన వారు సుమారు 1000 వరకు దరఖాస్తులు వేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. లిక్కర్ దుకాణాల టెండర్లకు మహా కిక్కు వస్తోందని ఎక్సైజ్ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్‌కు 'అగ్రి' కళాశాల

- ఆమోదం తెలిపిన రాష్ట్ర కేబినెట్
- వ్యవసాయ రంగానికి మరింత ఊతం
- విద్య, పరిశోధనలతో పాటు కొత్త వంగడాల సృష్టికి అవకాశం



డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయాధారిత జిల్లాగా పిలువబడే నిజామాబాద్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. ఈ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అగ్రి కోర్సులు చేసే నిజామాబాద్ జిల్లాతోపాటు కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల్ విద్యార్థులకు వ్యవసాయ కళాశాల వరమనే చెప్పొచ్చు. తెలంగాణ యూనివర్సిటీలో ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పుడు వ్యవసాయ కళాశాలను తేవడం నిజామాబాద్‌కు మరింత వన్నె తెస్తుంది. వ్యవసాయ కళాశాలను కూడా యూనివర్సిటీ పక్కనే ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులు పంటలకు పుష్కలంగా సాగునీటిని అందిస్తున్నాయి. దీంతో జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి. వరితోపాటు పసుపు, మొక్కజొన్న, సోయా, జొన్నలు, సజ్జలు కూడా ఎక్కువగా సాగవుతున్నాయి. జిల్లాలో పండించిన పంటలు ఇతర ప్రాంతాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక పంటలు, రైతులు ఉన్న జిల్లాల్లో ఒకటిగా నిజామాబాద్ ఉంది. దీంతో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు డిమాండ్ ఏర్పడింది. చెరుకు పరిశ్రమలు అలాగే రుద్రూర్ కృషి విజ్ఞా కేంద్రం, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రాలకు తోడుగా వ్యవసాయ కళాశాల రావడంతో రైతుల్లో హర్షం వ్యకమవుతోంది.

ఎంచక్కా విద్య... స్థానికంగా పరిశోధన...

ఇందూరు కేంద్రంగా వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే చుట్టు పక్కనున్న జిల్లాల విద్యార్థులు నిజామాబాద్‌లోనే వ్యవసాయ కోర్సులు పూర్తి చేయడానికి అవకాశం ఉంది. వ్యవసాయ కోర్సులు చేయాలంటే హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అంత దూరం వెళ్లి చదువు, పరిశోధనలు చేయాలంటే విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు నిజామాబాద్ వ్యవసాయ కళాశాలలోనే పట్టభద్రులుగా, పరిశోధకులుగా, ప్రొఫెసర్లుగా తయారు కావొచ్చు. వ్యవసాయానికి అనువుగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో పంటలపై ప్రయోగాలు సులువుగా చేయడానికి వీలుంటుంది.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

- నవంబర్ 14వరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు
- జిల్లాలో ఆవులు 68,370, గేదెలు 97,570..
- గొర్రెలు 4,87,903, మేకలు 1,50,046



దోమకొండ మండలం అంబారిపేటలో గేదెకు టీకా వేస్తున్న పశువైద్యుడు శివకుమార్

దోమకొండ : పాడి, గొర్రెలు, మేకల పెంపకం ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల వారికి జీవనాధారం. జీవనోపాధినిస్తున్న మూగజీవాల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు గాలికుంటు వ్యాధి నివారణ (ఎఫ్ఎండీ) అత్యంత కీలకం. పాడిపశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాడిరైతులు తీవ్రమైన నష్టాలను చావిచూడాల్సివస్తుంది. దేశవాళి పశువుల్లో కన్నా సంకర జాతి పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. పికార్నో అనే వైరస్ ద్వారా ఈ వ్యాధి పశువుల్లో త్వరగా వ్యాప్తి చెందుతుంది. గాలికుంటు వ్యాధిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రతి సంవత్సరం ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈనెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య బృందాలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నాయి. జిల్లాలో ఆవులు 68,370, గేదెలు 97,570 ఉన్నాయి. అదేవిధంగా గొర్రెలు 4,87,903, మేకలు 1,50,046 ఉన్నాయి. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది.

అక్షరయజ్ఞం చేస్తున్న 'సాక్షి'పై దాడులు..?



కామారెడ్డి టౌన్/బాన్సువాడ/ఎల్లారెడ్డి: ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిరంతరం అక్షరయజ్ఞం చేస్తున్న 'సాక్షి' దినపత్రిక, ఎడిటర్ ధనంజయ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఈ అన్యాయాలను, కుట్రలను అన్ని వర్గాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి.

కక్ష సాధింపు మానుకోవాలి



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాక్షి దినపత్రికపై కక్ష సాధింపు మానుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న పత్రికతోపాటు ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి.

– నీల నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

సాక్షి మీడియాపై దాడి హేయం



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సాక్షి మీడియాపై దాడి హేయం. వాస్తవాలను ఎత్తిచూపే సాక్షిపై కేసులు పెట్టి భయందోళన సృష్టిస్తున్న ఏపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి. ప్రజాస్వామ్యంలోని వ్యక్తులందరూ ఖండించాలి. ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి.

– సాయిబాబా, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి

అధికారం ఎవరిచ్చారు..



భారత్ వంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను కాలరాసే అధికారం కూటమి ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారు. రాజకీయ కక్షతో మూడు రోజులుగా సాక్షి దినపత్రిక ఎడిటర్‌ను అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటూ పోలీసులు కూటమి ప్రభుత్వానికి బానిసలుగా పని చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు.

– తులసీదాస్, విద్యార్థి నాయకుడు

క్లుప్తంగా

షీటీంలపై అవగాహన పెంచుకోవాలి



మాచారెడ్డి: విద్యార్థినులు షీటీంపై అవగాహన పెంచుకోవాలని మాచారెడ్డి ఏఎస్సై ప్రభాకర్ రెడ్డి సూచించారు. గురువారం పాల్వంచ మండలం ఆరేపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వాళ్లు 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. బాలికలు, మహిళలు ఏదైనా మోసాలకు గురైనప్పుడు 87116 86094 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సిబ్బంది రాజేందర్, సౌజన్య, భూమయ్య, తిరుపతి, శేషారావు, తదితరులు ఉన్నారు.

నేపాల్ అమ్మాయి.. తెల్గాపూర్ అబ్బాయి

● ఒక్కటైన ప్రేమజంట



నిజాంసాగర్(జుక్కల్): మహ్మద్‌నగర్ మండలం తెల్గాపూర్ గ్రామానికి చెందిన దనుల రవీందర్, నేపాల్‌కు చెందిన మాయ ఒక్కటయ్యారు. గురువారం తెల్గాపూర్ గ్రామంలో వేద పండితుడు, గ్రామస్తుల సమక్షంలో ఇద్దరి పెళ్లి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తెల్గాపూర్ గ్రామానికి చెందిన దనుల వెంకవ్వ, ఎల్లయ్య దంపతులు రెండో కుమారుడు రవీందర్ ఏడు సంవత్సరాల నుంచి దుబాయ్‌లో ఉంటూ ఉపాధి పొందుతున్నాడు. రవీందర్ పని చేస్తున్న కంపెనీలోనే నేపాల్‌కు చెందిన మాయ పనిచేస్తోంది. మూడు సంవత్సరాల నుంచి ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. పది రోజుల కిందట రవీందర్‌తోపాటు మాయ దుబాయ్ నుంచి తెల్గాపూర్ గ్రామానికి వచ్చారు. రవీందర్ తన తల్లిదండ్రులను ఒప్పించి మాయను వివాహం చేసుకున్నారు.

నేడు అంతంపల్లి విండో మహాజన సభ

భిక్కనూరు: అంతంపల్లి గ్రామ విండో మహాజన సభను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు విండో అధ్యక్షుడు వలకొండ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. విండో పరిధిలోని అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తప్పనిసరిగా సభకు హాజరు కావల్సిందిగా ఆయన కోరారు.

ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కు అభినందన

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్‌ను గురువారం రాత్రి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. 2025– 26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కృత్యాధార బోధనకు విశేష ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రతిభావంతమైన 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారి ద్వారా ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రయోగ దీపికలను రూపొందించారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా నుంచి ప్రవీణ్ కుమార్‌ను ఎంపిక చేశారు. ప్రవీణ్ ప్రతిభ, కృషిని గుర్తించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దరాంరెడ్డి ఉన్నారు.



ప్రవీణ్ కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పౌష్టికాహారం తీసుకోవాలి



చిన్నారులకు అన్నప్రాశన చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజూ తినే ఆహారంలో చక్కెర, ఆయిల్, ఉప్పు స్థాయిలను తగ్గించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో నిర్వహించే సామాజిక వేడుకలను మరింత బలోపేతం చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం రెగ్యులర్‌గా అందిస్తూ దేశాన్ని ఎనీమియా రహిత భారత్‌గా మార్చాలని సూచించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నపాసన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యలక్ష్మిలో రెగ్యులర్ అటెన్‌డెన్స్ ఉన్న గర్భిణులకు, నార్మల్ డెలివరీ అయి పూర్తి ఆరోగ్యంగా ఉన్న మహిళలు, చిన్నారులకు బహుమతులు అందజేశారు. ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ప్రోగ్రాం ఆఫీసర్ యమిమ, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోజీవాడికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి



వినతి పత్రం అందజేస్తున్న ఇస్రోజీవాడి యువకులు

కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడి గ్రామానికి ఆర్టీసీ బస్సు లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామానికి బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గ్రామ యువకులు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలకు సకాలంలో చేరడం లేదని పేర్కొన్నారు. కొందరు ప్రైవేటు వాహనాల్లో వెళ్తూ అధిక ధరలు చెల్లించాల్సి వస్తుండగా, ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో లేక ఇటు గర్గుల్‌కు, పోసానిపేట రోడ్డు వరకు నడిచి వెళ్లే పరిస్థితి నెలకొందని తెలిపారు. సమస్య అర్థం చేసుకొని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. యువకులు కొత్తపల్లి రాజు, సురేష్, ప్రశాంత్, అరవింద్, బన్నీ తదితరులు ఉన్నారు.

డీపీఆర్‌వోగా తిరుమల



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా నూతన డీపీఆర్‌వోగా ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న బి.తిరుమల బదిలీపై వచ్చారు. గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేసి, ఉత్తర్వులను అందుకున్నారు. ఇన్‌చార్జి డీపీఆర్‌వో రవికుమార్ నుంచి బాధ్యతలను స్వీకరించారు.

నేడు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

ఎల్లారెడ్డి: ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌ఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘం నాయకులు కంతి పద్మారావు, రామగల్ల శివానందం తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఆయనపై దాడి చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మార్వో కార్యాలయానికి ఎమ్మార్పీఎస్ దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

18న బీసీ రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

సాక్షి నెట్‌వర్క్:బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీఎల్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములుతో పాటు బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో వేర్వేరుగా పిలుపునిచ్చారు. అలాగే బీసీ బంద్‌కు సహకరించాలని బీసీ సంఘం నాయకులు పిట్లంలో తహసీల్దార్ రాజ నరేందర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. బంద్‌కు తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం నేతలు, తెలంగాణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్ యాదవ్‌లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..బీసీలకు 42శాతం రిజర్వేషన్ వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజనర్సు



కామారెడ్డి టౌన్: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజనర్సును ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజల్‌లో ఇటీవల నిర్వహించిన యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభల్లో జిల్లాకు చెందిన నాయకులను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. గుర్రం దీవెన, మహబూబ్, వీరయ్య, నర్సవ్వను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో చోటు సాధించిన వారిని జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అభినందించారు.

21 నుంచి పోలీస్ అమరుల వారోత్సవ పోటీలు

ఎస్పీ రాజేశ్ చంద్ర



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు విధి నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేస్తూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేష సేవలు అందించారన్నారు.

ఫొటో, షార్ట్ ఫిలిం పోటీలు..

అలాగే ఫొటో, షార్ట్ ఫిలిం పోటీలు కూడా నిర్వహించనున్నామని, విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొనవచ్చన్నారు. పోలీసులు చేసిన సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాల నివారణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ వంటి అంశాలపై 3 నిమిషాల లోపు షార్ట్ ఫిల్మ్‌లు లేదా సమాజంలో పోలీసుల ప్రతిష్ఠను పెంపొందించే ఫొటోలు రూపొందించి అక్టోబర్ 23లోపు కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫొటోలు(ప్రింట్ లేదా డిజిటల్), షార్ట్ ఫిల్మ్‌లు(పెన్ డ్రైవ్ రూపంలో) అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మూడు ఉత్తమ ఎంట్రీలకు బహుమతులు ప్రదానం చేస్తామని, వీరిలో ఉత్తములను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని, యువత, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని, పోలీస్ అమల త్యాగాలకు నివాళులర్పించాలని ఎస్పీ కోరారు.

విద్యార్థులకు పోటీలు..

ఈ సందర్భంగా జిల్లాలో విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అక్టోబర్ 21 నుండి 28 వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర-విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండాలి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులు https:// forms. gle/ jaWLdt2 yhNrMp e3 ఈ లో లాగిన్ అయి పేరు, విద్యార్హత ఇతర వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యాసాన్ని పేపర్‌పై రాసి, దానిని ఫొటో లేదా పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలన్నారు. వ్యాసరచనలో గరిష్ఠంగా 500 పదాలు మాత్రమే ఉండాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో బహుమతులతో సత్కరించి, రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల వివరాలు

- 20న బ్యానర్లు, హోర్డింగుల ఏర్పాటు
- 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉదయం 8 గంటలకు అమరవీరుల దినోత్సవ కార్యక్రమం
- 22న కామారెడ్డి, 24న ఎల్లారెడ్డి, 25న బాన్సువాడ డివిజన్లలో అమరవీరుల కుటుంబాలకు పరామర్శ
- 25న సైకిల్ ర్యాలీ
- 27న కామారెడ్డి, 28న ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లలో ప్రజా అవసరాల సేకరణ
- 29న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరం
- 30న ఓపెన్ హౌస్ కార్యక్రమం
- 31న క్యాండిల్ ర్యాలీ కార్యక్రమం

పశువులకు 'గాలికుంటు' టీకాలు

దోమకొండ: అంబారిపేట పశువైద్యశాలలో గురువారం పశువులలో గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఉచితంగా పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి శివకుమార్ తెలిపారు. నేటి నుంచి నవంబర్ 14 వరకు అన్ని గ్రామాలలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పశు వైద్య సిబ్బంది రమేష్, లింగం తదితరులున్నారు.

వంద మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్యపరీక్షలు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వంద మంది పెన్షన్‌దారులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. వైద్య నిపుణులు హరికృష్ణ, కృష్ణతేజ రెడ్డి, సాయి, మౌనిక, రఫీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నల తూకంలో మోసం

● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వ్యాపారులు



వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భిక్కనూరు: మండలంలోని గుర్జకుంట గ్రామంలో తూకంలో మోసం చేస్తూ వ్యాపారులు పట్టుబడ్డ ఘటన గురువారం చోటుచేసుకుంది. గాంధారి ప్రాంతానికి చెందిన గిరిజన వ్యాపారులు భిక్కనూరు మండలం గుర్జకుంటలో ఒక ఏజెంట్‌ను పెట్టుకొని మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న బస్తాను 62 కిలోల చొప్పున తూకం వేస్తున్నట్లు రైతులను నమ్మించి 72 కిలోల మొక్కజొన్నలను బస్తాలో నింపి వాహనాల్లో వేశారు. రైతులకు అనుమానం రావడంతో తూకం వేసే ఎలక్ట్రానిక్ కాంటా 10కిలోలు మైనస్‌లో చూపించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్‌ను, గాంధారి వ్యాపారులను నిలదీశారు. ఒక దశలో తూకంలో మోసానికి పాల్పడిన వారిని చెట్లకు కట్టివేయాలని పలువురు రైతుల యత్నించగా మిగతా రైతులు వారిని సముదాయించారు. చివరికి వ్యాపారులకు జరిమానా విధించి వదిలిపెట్టారు.

వాహనాల చోరీ నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో పలు చోట్ల వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ గురువారం వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి బోధన్, నిజామాబాద్, ఆర్మూర్, ముథోల్‌లో ఆటోలు, బైక్‌లను చోరీ చేసి కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ ఫజల్, మహ్మద్ నవాజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా షేక్‌అలీ, వహిద్, అలీమ్‌లతో కలిసి 9 ఆటోలు, మూడు బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అపహరించిన వాహనాలను కోరుట్లలో విక్రయించినట్లు పేర్కొన్నారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ ఇలియాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీసీఎస్ ఏసీపీ నగేంద్రచారి, సీఐ సాయినాథ్, ఇతర పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

తమ్ముడి ఇంట్లో అన్న చోరీ

● వ్యాపారంలో నష్టాలొచ్చాయని..
● కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రాజ్

నిజామాబాద్ అర్బన్: వ్యాపారంలో నష్టాలు, అప్పులు పెరగడంతో తమ్ముడి ఇంట్లో అన్న చోరీకి పాల్పడ్డాడు. నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పది రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మహ్మదీయకాలనీకి చెందిన మహ్మద్ సాబీర్ పాషా ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగిరాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. నగదుతోపాటు బంగారం చోరికి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రెండో టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇంటి పక్కనే ఉన్న అతని అన్న మహ్మద్ షఫీ పాషాను అనుమానించి విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పులు పెరగడంతో తమ్ముడి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం, రూ.7 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. షఫీ పాషాను అరెస్టు చేసి బంగారం, డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు విచారణలో టౌన్ ఎస్సై సయ్యద్ ముజాయిద్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

క్రైం కార్నర్

సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రుద్రూర్‌వాసి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన కర్రోళ్ల శ్రీనివాస్ (53) అనే వ్యక్తి గురువారం కుమురం భీం జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి దుర్మరణం చెందినట్టు స్థానికులు తెలిపారు. కూలి పని నిమిత్తం పది రోజుల క్రితం వెళ్లిన శ్రీనివాస్ మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న బంధువులు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు బయల్దేరి వెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గాంధారి శివారులో మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్ర శివారులోని గాంధారి–చద్మల్ రహదారి పక్కన గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రైతుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. దుండగులు గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి పెట్రోలు పోసి దహనం చేసినట్లు తెలుస్తోంది. మృతదేహం పాక్షికంగా దహనం అయింది. సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేశారు. మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30–35 ఏళ్ల మధ్య ఉంటుందని, నీలిరంగు జీన్ ప్యాంటు, తెల్లని బనియన్, నల్లచారలు కల్గిన తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా 8712686165, 8712686163 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్న పోలీసులు

మాచారెడ్డి: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. జూన్ 2న మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఆమ లక్ష్మీనారాయణ ఇంట్లో నుంచి గుర్తు తెలియని దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తులను అదే గ్రామానికి చెందిన రాయన పట్ల రాజు, గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన మేకల మాధవ్‌గా గురువారం గుర్తించారు. నిందితుల నుంచి ఐదు మాసాల బంగారు ఉంగరం, మూడు మాసాల వెండి గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

మహిళ అదృశ్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బైండ్ల గంగామణి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లింగంపేటకు చెందిన బైండ్ల సాయిలుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య గంగామణి, రెండో భార్య భూమవ్వ ఈ నెల 13న గొడవపడ్డారు. దీంతో పెద్ద భార్య గంగామణి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



దీమర వెంకట్(ఫైల్)

మాక్లూర్: చదువులో వెనుకబడి ఉన్నానన్న మనస్తాపంతో మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన దీమర వెంకట్(16) గురువారం సాయంత్రం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. చిక్లీ గ్రామానికి చెందిన దీమర సాయిరెడ్డి, మంజుల కుమారుడు వెంకట్ డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. చదువులో నెలవారీగా నిర్వహించే కామన్ పరీక్షలలో తోటి స్నేహితుల కంటే తక్కువ మార్కులు వస్తున్నాయన్న బాధతో ఉండేవాడని తెలిపారు. దీపావళి పండుగ కోసం నాలుగు రోజుల ముందే చిక్లీకి వచ్చాడు. గురువారం వెంకట్ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.